అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం ఆవరణలో శుక్రవారం నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది ప్రజాపాలన ప్రభుత్వమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో సీఎం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా లేకపోవడంతో పథకాల అమలులో జాప్యం జరుగుతోందని అయినా దశల వారిగా అన్ని పథకాలను అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బొడ్రాయి పున:ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లమల పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి సహకారంతో నల్లమలలోని ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. సీబీఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనురాధ, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కౌన్సిలర్లు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సామాజిక తనిఖీ



మర్రిగుంతతండాలో నర్సరీని పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. శుక్రవారం మండలంలోని మర్రి గుంతతండా, పోతేపల్లి, పెద్దాపూర్, కుప్పగండ్ల తదితర గ్రామాల్లో ఆ బృందం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023–2024 సంవత్సరానికి సంబంధించి పనులను పరిశీలించామని వివరించారు. అప్పట్లో ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల్లో అవకతవకలు, పనుల నాణ్యత, బిల్లుల చెల్లింపు తదితర అంశాలను కూలీలతో మాట్లాడి నమోదు చేస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 15 బృందాలతో తనిఖీ చేపడుతన్నామని పేర్కొన్నారు. తనిఖీ సమయంలో కూలీలు, ఉపాధి హామీ సిబ్బంది పూర్తిగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎం అజయ్‌కుమార్, ఎస్‌ఆర్పీ భద్రునాయక్, డీఆర్‌పీలు వెంకటేష్, రాములమ్మ తదితరులు ఉన్నారు.

దుకాణదారులపై అద్దెభారం తగదు

నాగర్‌కర్నూల్‌రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ఒకేసారి మూడేళ్లకు సంబంధించి అద్దె చెల్లించాలని నిర్ణయం తీసుకోవవడం సరికాదని దీంతో దుకాణదారులపై అద్దెభారం పెరుగుతోందని మూడేళ్లకు సంబంధించి అద్దెపై టేనెంట్ అసోసియేషన్ కలిసి వక్ఫ్ కార్యాలయం ఉద్యోగి షేక్ ఫరీద్ అహ్మద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వక్ఫ్ నిబంధనల ప్రకారం ఏడాదికి 11 శాతం పెంచాలని మూడేళ్లకు ఒకేసారి 33 శాతం పెంచడం సరికాదన్నారు. మున్సిపల్ టాక్స్, మెయింటనెన్స్, దుకాణం అద్దె భారంగా మారుతోందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా ఖాన్, షేక్ వజీద్, మహ్మద్ అలీం, ముస్తాక్ అహ్మద్, మహుముద్ ఖరీం, ఆదిల్, సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చడం దారుణం



కల్వకుర్తి రూరల్: రోడ్డు విస్తరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం చారగొండ నిర్వాసితులను ఆదుకోవాలని ఆర్డీఓ శ్రీను నాయక్‌కు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 చట్టం ప్రకారం ఇల్లు కోల్పోయిన వారందరికీ 150 గజాల స్థలం కేటాయించి ఇల్లు నిర్మించాలని లేనిపక్షంలో రూ.50 లక్షలు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లు కూల్చడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మల్లయ్య, ఆంజనేయులు, బాలస్వామి, బాల్‌రెడ్డి, కిషోర్, చెన్నయ్య, కిరణ్, రాజు, కవిత, లింగమయ్య, లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

తాడూరు: మండలంలోని పాపగల్‌లో జంగిరెడ్డికి చెందిన పాడి గేదెల చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. గ్రామానికి చెందిన జైపాలు జంగిరెడ్డి దగ్గర ఉన్న పాడి గేదెల కాపరిగా ఉంటు శుక్రవారం సంతలో విక్రయించేందుకు రెండు గేదెలను తీసుకెళ్తుండగా స్థానికులు గమనించి జంగిరెడ్డికి సమాచారం అందించారు. చోరీకి పాల్పడిన జైపాల్‌పై కేసు నమొదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెటర్నరీ డాక్టర్ నియామకం

వంగూరు: సీఎం రేవంత్‌రెడ్డి స్వంత గ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో ఇటీవల నిర్మించిన పశు వైద్యశాలకు ఒక డాక్టర్‌ను, ఒక అసిస్టెంట్‌ను నియమించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఆర్థికశాఖ అనుమతులు ఇచ్చారు. దీంతో కొండారెడ్డిపల్లి, తుమ్మలపల్లి తదితర గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



లింగాల: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థినులను పరీక్షలకు సిద్ధం చేయడంపై సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందించారు. వెనుకబడిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. మండలంలోని అవుసలికుంట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



చారకొండ: మండలంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని జీపీ సంబంధిత ప్లాట్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నమునా ఇంటి నిర్మాణానికి మండల అధికారులు, నాయకులతో కలిసి హౌసింగ్ డీఈ ఆనంద్‌రెడ్డి మార్కింగ్ చేశారు. ప్రతి మండలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నమూనాను చేపడుతున్నట్లు డీఈ తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసే రూ.5 లక్షలతో ఏ విధంగా నిర్మించుకోవాలో నిర్మాణంలో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీఓ వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి గణేష్, కాంగ్రెస్ నాయకులు మహేందర్, అంజయ్య, శివ, రవి గౌడ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



నాగర్‌కర్నూల్‌లో రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



నివాళులర్పిస్తున్న బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు, తదితరులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో రమాబాయిఅంబేద్కర్ 127వ జయంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలిలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ పృథ్వీరాజ్, బోనాసి రాంచందర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కల్యాణ్, వంగూరి జయశంకర్, నాగేష్, భాస్కర్, బాల్‌నాగులు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి జీవితం ఆదర్శనీయం

కొల్లాపూర్: పట్టణంలోని ఎస్టీ బాలుర కళాశాల వసతిగృహంలో రమాబాయి చిత్రపటానికి బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు, ప్రభుత్వ పీజీ కళాశాలలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు డి.శేఖర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వంశీ, మధు, నవీన్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బల్మూర్: మండలంలో 33 కేవీ లైన్ల మరమ్మతు కారణంగా శనివారం బల్మూర్, కొండనాగుల, కొండారెడ్డిపల్లి సబ్ స్టేషన్లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో శుక్రవారం మండల విద్యాధికారి శ్రీనివాస రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సబ్జెక్టులపై ఉన్న అనుమానలను నివృత్తి చేశారు. 10వ తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన అన్నారు. హాస్టల్ విద్యార్థులతో కలసి అల్పాహారాన్ని స్వీకరించారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో శుక్రవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం శ్రీపురం గ్రామానికి చెందిన శ్రీజ ఈనెల 6న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

లింగాల: మండలంలోని దారారంలో శుక్రవారం సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. దాడుల్లో 14 లీటర్ల సారాను స్వాధీన పర్చుకొని 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన పాత్లావత్ రమేష్, మంజుల, బామిని అనే వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు జనార్దన్, అరుణాదేవి, నవీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహం సందర్శన



తాడూరు: మండల కేంద్రంలోని బాలికల వసతి గృహాన్ని శుక్రవారం మండల నోడల్ అధికారి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని మూత్రశాలలు, పరిసరాల పరిశుభ్రత విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీఓ ఆంజనేయులు ఉన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

బల్మూర్: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగు నివారించొచ్చని జిల్లా ఉప వైద్యాధికారి తారాసింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నులి పురుగుల నిర్మూలన దినం పురస్కరించుకొని వైద్య సిబ్బంది, అంగన్ వాడీ టీచర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదిన జాతీయ నులి పురుగు నిర్మూలన దినోత్సవాన్ని పుస్కరించుకొని నులి పురుగు సంక్రమణ, నివారణ, ఆల్బెండజోల్ మాత్రల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్, కల్పన, వైద్య సిబ్బంది శ్రీనివాసులు, విజయ్‌కుమార్, వెంకటమ్మ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా జాగృతి సభ్యులు హైదరాబాదులో ఎమ్మెల్సీ కవితను కలిశారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సామాజిక సేవలను విస్తరించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గణేష్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు, శేఖర్, సైదులు, నాగరాజు ఉన్నారు.

ఘన సన్మానం

కల్వకుర్తి రూరల్: రిక్రియేషన్ క్లబ్ వెల్దండ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో సన్మానించారు. క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తారంగా నిర్వహించాలని శివాజీ సేవా సమితి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



చారకొండ: బైపాస్ నిర్మాణంలో ఇళ్లను కోల్పోయిన 29 ఇళ్ల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర మహిళ మోర్చా అధికార ప్రతినిధి లావణ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరి రెడ్డికి, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్‌కు వినతిపత్రాలను వేర్వేరుగా అందజేశారు. బాధితులకు ప్రభుత్వం ఇంటిస్థలం, ఇంటి నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌గౌడ్, కిరణ్, బాధితులు తదితరులు ఉన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిర్మలాపూర్‌లోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ప్రధాన అర్చకుడు శేషచార్యులు శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పి చంద్రశేఖర్ దంపతులు ఆలయానికి మకర తోరణం అప్పగించారు. ఆలయ పూజారి శేషాచార్యులు వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

10న కేంద్ర బడ్జెట్‌పై ధర్నా



కల్వకుర్తి రూరల్: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ 10న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్ బడా బాబుల, కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూలంగా ఉందని విమర్శించారు. వ్యవసాయ, పేద, మధ్య తరగతి, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడుతున్నామన్నారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కిషోర్, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

లింగాల: ఈ నెల 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మండలంలోని సూరాపూర్‌కు చెందిన బంజార సంఘం గౌరవ అధ్యక్షుడు సుక్నియా నాయక్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనునాయక్, ప్రధాన కార్యదర్శి ఆంగోతు శ్రీనునాయక్ కోరారు. శుక్రవారం సేవాలాల్ జయంతి నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. బంజారాల సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, తీర్యానాయక్, శక్రు, మోత్యా తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే తులం బంగారం ఇస్తాం



చెక్కులు పంపిణీ చేస్తున్న జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: త్వరలోనే తులం బంగారం పథకాన్ని అమల్లోకి తీసుకువస్తామని రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కొల్లాపూర్, కోడేరు, పెంట్లవెల్లి, వీపనగండ్ల మండలాలకు చెందిన 250 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిజమైన అర్హులకే అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావుతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/తిమ్మాజిపేట: కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన ముగ్గురు పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు పార్టీ ప్రమాద బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల మనుగడ పార్టీ కార్యకర్తలల మీద ఆధార పడి ఉంటుందన్నారు. తిమ్మాజిపేట గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కదిరే పాండు కుటుంబ సభ్యులకు, తిమ్మాజిపేట మండలంలోని అమ్మపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త సంక బాలరాజు కుటుంబ సభ్యులకు, బిజినపల్లి మండలంలోని కార్కొండ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త బొట్క భీముడు కుటుంబ సభ్యులకు ఒక్కోక్కరికి రూ.2 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రైతు దీక్షను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: ఈనెల 13న ఆమనగల్లు పట్టణంలో నిర్వహించే రైతు దీక్షను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీలను నెరవేర్చడం లేదన్నారు. రుణమాఫీ, రైతుభరోసా పూర్తిస్థాయిలో అమలుకాలేదన్నారు. ఆమనగల్లులో నిర్వహించే రైతు దీక్షకు టీఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలు హాజరవుతారని తెలిపారు. రైతులు, మహిళలు, పార్టీ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉప్పల వెంకటేష్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, విజితారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని జీడిపల్లిలో శుక్రవారం ఖాజా బందే నవాజ్ దర్గాలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, మాజీ జెడ్పీటీసీ అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, భీమ్లా నాయక్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అనిల్ గౌడ్, మండల శాఖ అధ్యక్షుడు బాలరాజు, అంజి, కిష్టారెడ్డి, రమేష్, రఘు, బందిగయ్య, శ్రీశైలం, యాదయ్య, యాదిరెడ్డి, గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఏఓ

కొల్లాపూర్: మండలం మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ పంటలను మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్‌యాదవ్ పరిశీలించారు. వరి, వేరుశెనగ, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించి, సాగు విధానాల గూర్చి రైతులతో మాట్లాడారు. సాగులో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఏఈఓలు సూర్యతేజ, శిరీష తదితరులు ఉన్నారు.

హెచ్‌ఎంను సస్పెన్షన్ చేయాలి

కొల్లాపూర్: మండలంలోని మొలచింతలపల్లి ఆశ్రమ పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠశాలలో నాసిరకం భోజనం వడ్డిస్తున్నారని ఆరోపించారు. పాఠశాల హెచ్‌ఎం సమయపాలన పాటించడం లేదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎంను సస్పెన్షన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు శివ, కార్తీక్ తదితరులు ఉన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

తాడూరు: ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అంతారంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికి దేశం, రాష్ట్రంలో అసమానతలు, అస్పృశ్యత, ఆర్థిక దోపిడి కొనసాగడం పాలక వర్గాలకు సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించొద్దన్నారు. నాయకులు ఆంజనేయులు, కృష్ణమ్మ, హనుమంతు, వెంకటయ్య, శ్రీను, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలి



కందనూలు: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ బహుమతి పొంది జాతీయ స్థాయికి ఎంపికైన 9వ తరగతి విద్యార్థులు కె. విజ్ఞశ్రీ, ఎం. అఖిలను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో విద్యార్థులు మెరుగైన ప్రదర్శన నిర్వహించి సత్తా చాటాలని సూచించారు. అలాగే స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జోషఫ్‌రాయ్, చిదిరి నరేష్, తీగల మురళి, సరిత సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సింగోటం రామన్నకు నివాళి

కొల్లాపూర్: బీజేపీ నాయకుడు సింగోటం రామన్న ప్రథమ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన విగ్రహాన్ని కుటుంబీకులు ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీల పక్షాన రామన్న చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వాకిటి ఆంజనేయులు, గోపాలకృష్ణ, రామస్వామియాదవ్, సుధాకర్, బెమిని కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లు అనంతరాములు సేవలు మరువలేనివి

కొల్లాపూర్: మాజీ పీసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లు అనంతరాములు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు అన్నారు. మల్లు అనంతరాములు వర్ధంతిని శుక్రవారం కొల్లాపూర్‌లోని శ్రీవాణి విద్యానిలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్, న్యాయవాది మధుసూదన్‌రావు, నాయకులు జమీల్‌అహ్మద్‌ఖాన్, వెంకటస్వామి, బాలపీరు, మణి, జుబేర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కొల్లాపూర్: ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన సులువు అవుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మినీ స్టేడియంలో విద్యార్థులకు ప్రేరణా సదస్సు ఏర్పాటు చేశారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు సదస్సుకు హాజరయ్యారు. కలెక్టర్‌తోపాటు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కశ్యప్ హాజరై మాట్లాడారు. చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా భావిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరిలో తమదైన సృజనాత్మకత ఉంటుందని, వాటిని వెలికి తీసి తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. ఒత్తిడి జయించేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రత్నగిరి ఫౌండేషన్ మేనిజింగ్ ట్రస్టీ జూపల్లి జగన్మోహన్‌రావు, కన్వీనర్ కేతూరి ధర్మతేజ, డీఈఓ రమేష్‌కుమార్, డీఐఓ వెంకటరమణ, ఆర్డీఓ భన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.